సాక్షి
కరీంనగర్
శుక్రవారం | 9 | ఆగస్టు | 2024



గోదావరిలో భక్తుల స్నానాలు

ధర్మపురి: ధర్మపురి గోదావరిలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రావణ మాసం సందర్భంగా గురువారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పుణ్యస్నానాలు చేశారు.



ప్రత్యామ్నాయం.. వరదకాలువ

ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా నీళ్లు సూరమ్మ ప్రాజెక్టులోకి చేరకుంటే.. ఎస్సారెస్పీ రివర్స్ పంపింగ్‌పై ఆధార పడేలా అధికారులు ఆలోచన చేస్తున్నారు.

- IIలో

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి



పీహెచ్‌సీ వైద్యులతో ఐడీఎస్‌పీ బృందం

కరీంనగర్‌టౌన్/మానకొండూర్/మానకొండూర్ రూరల్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సర్వే బృందం సూచించింది. సీజనల్ వ్యాధుల ముందస్తు నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఎపిడమియాలజిస్ట్ రాజు, రాష్ట్ర మైక్రో బయాలజిస్ట్ పి.ముక్తా కంటేశ్ జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పర్యటించారు. మానకొండూర్, వెల్ది, బుట్టి రాజారాంకాలనీ, మోతాజ్ ఖానా పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్య సిబ్బంది తీసుకుంటున్న ముందస్తు చర్యలను పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుజాతతో చర్చించారు. టి.స్వామి, ఎండీ.ఖాలిక్, జే.శివకృష్ణన్ పాల్గొన్నారు.

108 వాహనాల తనిఖీ



108సిబ్బందితో మాట్లాడుతున్న కిరణ్‌కిషోర్

కరీంనగర్‌టౌన్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ తెలంగాణ రాష్ట్ర 108, 102 సర్వీసుల హెచ్ఆర్ ప్రధాన అధికారి బి. కిరణ్ కిషోర్ గురువారం కరీంనగర్‌లోని 108 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలు, అత్యవసర మందులు, సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఎలాంటి అత్యవసర సంఘటన జరిగినా 10 నిమిషాల లోపు ప్రమాద స్థలికి చేరుకోవాలని సూచించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా 108 మేనేజర్ సలీం, జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ ఇమ్రాన్, 108, 102, 1962, పార్థివ వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం



మొక్క నాటుతున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది గురువారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి, పార్కింగ్‌స్థలంలో మట్టిని నింపి చదును చేశారు. అనంతరం మొక్కలు నాటి పరిశుభ్రతకు, పర్యావరణానికి ప్రతీ ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, వైద్యులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితం కావాలి



గాగిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న జయప్రకాశ్

చిగురుమామిడి: రైతులు సంఘటితంగా ఉన్నప్పుడే సహకార సంఘాలు బలోపేతమవుతాయని నాబార్డు డీడీఎం జయప్రకాశ్ అన్నారు. గురువారం చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఎఫ్‌పీవో మరింత బలోపేతం కానుందని, ప్రతీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుతో పాటు విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే వాడాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులకు బదులుగా కంపోస్టు ఎరువులను వాడితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. వర్షాకాలంలో రసం పీల్చేపురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు మంద శ్రీనివాస్, శాస్త్రవేత్త మహేశ్, జెల్లకుమార్, రాజ బహదూర్, అన్నాడి స్వరూప, నరాల రాజయ్య, మంద వెంకన్న పాల్గొన్నారు.

నేడు నాగ, గరుడ పంచమి

కరీంనగర్ కల్చరల్: శ్రావణమాసంలో వచ్చే నాగుల పంచమి, గరుడ పంచమి వేడుకలను శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకునేందుకు సిద్ధం అయ్యారు. శైవ, వైష్ణవాలయాల పరిసరాల్లోని పుట్టల్లో భక్తులు పాలుపోసి, వైష్ణవాలయాల్లో గరుత్మంతుడిని ఆరాధించనున్నారు. భక్తులు పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి, నువ్వులు, బియ్యం ముద్దలు నైవేద్యంగా సమర్పిస్తారు. ఉపవాసాలు పాటించి, పుట్టమట్టిని బంగారంగా భావించి తిలకధారణ చేసుకుంటారు. గరుత్మంతుడిని ఆరాధిస్తారు.

‘దళితబంధు’లో హుజూరాబాద్‌కే పెద్దపీట

- మిగిలిన జిల్లాల్లో పెద్దగా ఖర్చుకాని నిధులు
- రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ అమాంతంగా పెంపు
- అదనంగా మరో రూ.3,442 కోట్లు వెచ్చింపు
- మొత్తంగా రూ.4,442 కోట్లకు చేరిన వైనం
- కరీంనగర్ నుంచి రూ.157 కోట్లు వెనక్కి
- మొత్తం నిధుల్లో 47శాతమే వినియోగం
- పథకంలో లోపాలను ఎత్తిచూపిన ‘కాగ్’



కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న దళితబంధు యూనిట్లు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకం అమలుతీరును కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్)–2023 నివేదికలో కడిగేసింది. దళితుల అభ్యున్నతి కోసమని ప్రవేశపెట్టిన ఆ పథకానికి ఆరంభంలో పెద్దపీట వేసిన సర్కారు.. కాలక్రమంలో ప్రాధాన్యం తగ్గించిందని వెల్లడించింది. అందులోనూ కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ మినహా రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో పథకం అనుకున్న మేర అమలు కాలేదని, తీవ్ర జాప్యం జరిగిందని స్పష్టంచేసింది. అసలు దళితబంధు కోసం కేటాయించిన నిధుల్లో కేవలం 47శాతం మాత్రమే ఖర్చు చేసిందని, మిగిలిన వాటిలో కరీంనగర్ రూ.157 కోట్లు వెనక్కి పంపగా.. దాదాపుగా రూ.1300 కోట్లకుపైగా ఇంకా అలాగే ఉండిపోయాయని తన నివేదికలో వివరించింది. దళితబంధు అమలులో లోపాలను ఎత్తిచూపుతూ కాగ్–2023 నివేదికలో వెల్లడించిన మరిన్ని విషయాలు..

రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.4,442 కోట్లకు బడ్జెట్

వాస్తవానికి ఈ పథకం కోసం ప్రభుత్వం ముందే సిద్ధమైంది. 2021–22 బడ్జెట్ ప్రసంగంలోనే అప్పటి సీఎం కేసీఆర్ దళిత్ ఎంపవర్‌మెంట్ స్కీం కింద రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దళితులు తమకు నచ్చిన రంగంలో రాణించేందుకు బ్యాంకులకు తిరిగి చెల్లించకుండా ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. హుజూరాబాద్, వాసాలమర్రి, ఆలేరులో ఈ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించినా.. హుజూరాబాద్‌ను పైలట్ ప్రాజెక్టు కింద తీసుకున్నారు. అనంతరం ప్రతిపాదిత రూ.వెయ్యి కోట్లకు అదనంగా మరో రూ.3,442 కోట్లు కేటాయించింది అప్పటి ప్రభుత్వం. ఇందుకోసం ఇతర శాఖలైన ఎకనమిక్ సపోర్ట్ స్కీంలో రూ.1,338 కోట్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో రూ.1,275 కోట్లు, పట్టణ, గ్రామీణ పేదల ఇళ్ల నిర్మాణం పథకంలో రూ.885 కోట్లు మిగిల్చి ఈ పథకం కోసం వెచ్చించారు.

- వాస్తవానికి రూ.3,107 కోట్లను పథకం అమలుకు జిల్లాలకు టీఎస్‌సీసీడీసీఎల్ (తెలంగాణ షెడ్యూల్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి పంపారు.
- ఇందులో రూ.2,101 కోట్లు మాత్రమే (కేటాయించిన దాంట్లో కేవలం 47శాతం మాత్రమే) వినియోగించారు. రూ.157కోట్లు కరీంనగర్ నుంచి తిరిగి టీఎస్ సీసీడీసీఎల్‌కు పంపారు. రూ.783 కోట్లు ఇంకా జిల్లాల వద్ద, రూ.223 కోట్లు మాత్రం ఇంకా టీఎస్ సీసీడీసీఎల్ వద్దే ఉన్నాయి. దాదాపు రూ.1335 కోట్లు కార్పొరేషన్ వద్దే ఉండగా.. సుమారు రూ.2,101 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లయ్యింది.

పథకం అమలులో తీవ్ర జాప్యం

పథకం అమలులో ఆరంభంలో హుజూరాబాద్‌లో దూకుడు ప్రదర్శించిన ప్రభుత్వం.. ఆ తరువాత తీవ్ర జాప్యం కనబరిచింది. రాష్ట్రంలోని మిగిలిన 118 నియోజకవర్గాల్లోనూ ఈ పథకాన్ని 100 యూనిట్ల చొప్పున అమలు చేస్తామని ప్రకటించింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 38,511 దరఖాస్తులు రాగా.. 21,339 మందికి మాత్రమే పథకం అమలు జరిగింది. వీరిలో ఒక్క హుజూరాబాద్ నియోజకవర్గంలోనే దాదాపు 18000 మందికిపైగా రావడం గమనార్హం. నిర్మల్, రాజన్నసిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం ఐదు జిల్లాల్లో అయితే.. 1152 మంది దళితబంధు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం ఆయా జిల్లాలకు రూ.78 కోట్లు కూడా విడుదలయ్యాయి. అయితే దరఖాస్తుదారులెవరికీ పథకం అందలేదని కాగ్ నివేదించింది.

పనిమంతులకే ‘ప్రశంస’!

- శాఖల వారీగా జాబితాకు ఆదేశం
- ఈ నెల 12 గడువు
- స్వాతంత్య్ర దినోత్సవాన అందజేత



జిల్లాలో శాఖలు, విభాగాలు: 65
మొత్తం ఉద్యోగులు: 8,607
గెజిటెడ్ అధికారులు: 1,155
నాన్ గెజిటెడ్ అధికారులు: 6,295
నాలుగో తరగతి ఉద్యోగులు: 1,157

కరీంనగర్ అర్బన్: పనిమంతులకే ప్రశంసాపత్రం అందాలని జిల్లా యంత్రాంగం నిర్దేశించింది. ప్రతి స్వాతంత్య్ర, గణతంత్ర, తెలంగాణ అవతరణ దినోత్సవాల క్రమంలో ఉత్తమ ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేయడం పరిపాటి. అటెండర్ నుంచి జిల్లా అధికారి వరకు ప్రశంసాపత్రాలు ఇవ్వనుండగా విధుల నిర్వహణలో ఉత్తమ పనితీరును కనబరిచినవారినే గుర్తించాలని కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి ఆగస్టు 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవానికి సుమారు 180– 220మంది వరకు ప్రశంసాపత్రాలను అందజేసేవారు. ఈ సారి గతంలో తీసుకున్నవారిని మినహాయించి పనితీరు, హాజరు, రిమార్కులు లేని వారిని గుర్తించనున్నారు. గతంలో 10వ తేది తదుపరి జాబితా రూపకల్పనకు ఆదేశాలుండగా ఈ సారి ముందుగానే జాబితా కోరడం ఆహ్వానించదగ్గ పరిణామం.

పనిమంతులకే దక్కేనా

పలుశాఖల్లో అధికారుల అడుగులకు మడుగులొత్తే వారికి ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 65 శాఖల విభాగాలుండగా 8వేలకు పైగా ఉద్యోగులున్నారు. జిల్లా అధికారులను కలెక్టర్ గుర్తించనుండగా కిందిస్థాయి అధికారులను గుర్తించడం ఆయాశాఖల అధికారులకే అధికారం. స్థాయిని బట్టి అటెండర్, నాన్‌గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల క్రమంలో ప్రశంసాపత్రాలు ఇవ్వనుండగా ఒక్కోశాఖ నుంచి 4నుంచి 15మంది పేర్లను పంపనున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీస్, జెడ్పీశాఖల్లో ఎక్కువమందికి ప్రశంసా దక్కనుండగా ఇతర శాఖల్లో 8–12మందికి దక్కనుండగా చిన్న శాఖలకు 4–6 మందికే అవార్డులు ఇవ్వనున్నారు. ప్రతీ ఉద్యోగికిశాఖలో గుర్తింపు ఉండాలని కోరుకోవడం సహజం. అందుకనుగుణంగా నిబద్ధతతో పనిచేసేవారికి కొదువలేదు. ప్రతిరోజు విధులకు హాజరవడం, నిర్వర్తించే కార్యవర్తనాలకు సంబంధించి పక్కాగా వ్యవహరించడంలో పలువురు వారికి వారే ప్రత్యేకం. తీరా ప్రశంసాపత్రాల క్రమంలో పైరవీలకు తావివ్వడం జరుగుతున్న పరిణామం. మరి ఈ సారైనా పనిమంతులకే ప్రశంసా దక్కాలని ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

ఈ నెల 12 గడువు.. సకాలంలో జాబితా చేరేనా..?

ఉత్తమ ఉద్యోగుల జాబితాను ఈ నెల 12లోగా పంపాలని కలెక్టర్ ఆదేశించగా తదనుగుణంగా జాబితా అందుతుందా..నన్నది అనుమానమే. ఆయా శాఖలకు సర్క్యులర్ జారీ కావాల్సి ఉండగా ఇప్పటికి చేరకపోగా జాబితా కసరత్తు పారదర్శకంగా సాగుతుందా.? 9వ తేదీ ఒక రోజే ప్రభుత్వ కార్యాలయాలు పని చేయనుండగా 10 రెండో శనివారం కాగా 11వ తేది ఆదివారం వరుసగా రెండు రోజులు సెలవు. ఈ క్రమంలో 12వ తేదీలోగా జాబితా అందించడం అనుమానమే.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు



జమ్మికుంట: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతులు కల్పించాలని అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. జమ్మికుంటలోని బాలికల హాస్టల్, ప్రభుత్వ డిగ్రీవిద్యార్థుల హాస్టల్, మైనార్టీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, వంట సామగ్రి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగారు. మెనూ సమస్య ఉందని, గ్రీజర్ ఒకటే పని చేస్తోందని, క్రీడా సామగ్రి లేదని విద్యార్థులు వివరించారు. సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డెన్లు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కార్మికుల డిమాండ్లకు ఓకే

- 15వ తేదీన నెరవేరుస్తామని హామీ
- లేకుంటే 16 నుంచి సమ్మె

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లకు అధికారులు అంగీకరించారు. కార్మికుల టోకెన్ సమ్మె నోటీసు నేపథ్యంలో గురువారం సీఐటీయూ, బీఆర్‌టీయూ సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులతో నగరపాలక అధికారులు చర్చలు జరిపారు. కార్మికుల డిమాండ్లను సంఘ నాయకులు అధికారుల ముందుంచారు. దీంతో ఒక నెల ఏరియర్స్ ఇస్తామని, ఈ నెల 15వ తేదీన దుస్తులు, రెయిన్‌కోట్లు, షూలు ఇస్తామని అధికారులు తెలిపారు. వీటితోపాటు స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరగా, ఒక్కోటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అంగీకరించిన కార్మిక సంఘాల నాయకులు 15వ తేదీ వరకు వేచి చూస్తామన్నారు. డిమాండ్లు పరిష్కారం కాకపోతే 16వ తేదీ నుంచి సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ చర్చల్లో నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ వేణుమాధవ్, కార్మిక సంఘాల నాయకులు జనగాం రాజమల్లు, బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

13న బల్దియా సమావేశం

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నారు. మేయర్ వై.సునీల్‌రావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరయ్యే అవకాశం ఉంది. కాగా ఈ సమావేశానికి సంబంధించి 84 అంశాలతో కూడిన ఎజెండాను సభ్యులకు గురువారం అందజేశారు.

బల్దియా అధికారులకు బాధ్యతలు కేటాయింపు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో అధికారులకు బాధ్యతలు కేటాయిస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు నగరపాలకసంస్థకు డిప్యూటీ కమిషనర్ మాత్రమే ఉండగా, ఇటీవల బదిలీల్లో అదనపు కమిషనర్, సహాయ కమిషనర్ రావడం తెలిసిందే. దీంతో నగరపాలకసంస్థ పాలనాపరమైన బాధ్యతలను ముగ్గురు అధికారులకు విభజిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదనపు కమిషనర్ సువార్తకు పెన్షన్స్, బర్త్ అండ్ డెత్, ఆర్‌టీఐ, ప్రజాదర్బార్, కోర్టుకేసులు, లోకాయుక్త, ట్రేడ్‌లైసెన్స్, టాప్‌సెక్షన్లు అప్పగించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణికి ఎస్టాబ్లిష్‌మెంట్, ప్రజావాణి, రెవెన్యూసెక్షన్, పాస్ అండ్ పే ఆర్డర్, మెప్మా, సహాయ కమిషనర్ వేణుమాధవ్‌కు శానిటేషన్ (అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో),ట్రేడ్ లైసెన్స్, ప్రజాపాలన, ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ పథకాలు, డంపింగ్‌యార్డ్, కంపోస్టు యూనిట్, డీఆర్‌సీసీ బాధ్యతలు అప్పగించారు. సెక్రటరీ వెంకన్నకు కౌన్సిల్ సమావేశం, సీఎస్‌సీ, ఇన్‌చార్జి ఎస్ఈ రాజ్‌కుమార్‌కు ఇంజినీరింగ్ విభాగం, కార్యాలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలి
- ఈనెల 15 లోపు బడి పిల్లలకు షూ అందిస్తాం
- ‘స్వచ్ఛదనం- పచ్చదనం’లో కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్: తడి- పొడిచెత్తను వేర్వేరుగా చెత్తబుట్టల్లో వేసేలా విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఒప్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. హుజూరాబాద్‌లోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం నిర్వహించిన ‘స్వచ్ఛదనం- పచ్చదనం’ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు స్వచ్ఛదనం పచ్చదనం, కుక్కలు, కోతులతో ఎలా జాగ్రత్తగా ఉండాలో అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు భోజనానికి చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, రోడ్‌సైడ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతీ శుక్ర, మంగళవారాల్లో చేపట్టే ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. జిల్లాలో ఎక్కడా డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వ్యాపించకుండా ఫీవర్ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని, స్టీల్ డబ్బాలు వాడాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు అందించారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న హుజూరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్‌ను అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఆర్డీవో రమేశ్ బాబు, తహసీల్దార్ కనకయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వెటర్నరీ డాక్టర్ రవికుమార్, కౌన్సిలర్ రమ పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పక్కా ఏర్పాట్లు

కరీంనగర్ అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. వేదిక, సీటింగ్ ఏర్పాట్లను చేసుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. అన్నిశాఖల పనితీరును చాటేలా, గృహజ్యోతి, మహాలక్ష్మి, రూ.500కు గ్యాస్ కనెక్షన్, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, వనమహోత్సవం తదితర పథకాల శకటాలు, స్టాల్స్ ఉండాలన్నారు. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేనందున ప్రత్యేక అధికారులు జెండావిష్కరణ జరిపి, జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, అడిషనల్ డీసీపీ అశోక్ జయకుమార్, టౌన్ ఏసీపీ నరేందర్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో మహేశ్వర్, డీఆర్‌డీవో శ్రీధర్, సీపీవో కొమురయ్య పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి మల్టీపర్పస్ పార్క్

- రూ.11 కోట్లతో ఆకర్షణీయంగా అభివృద్ధి
- మేయర్ యాదగిరి సునీల్‌రావు



పనులు పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరం నడిమధ్యలో రూ.11 కోట్లతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ పార్క్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. పార్క్‌లో చేపట్టిన ల్యాండ్ స్కేపింగ్, మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్, ఆంఫీ థియేటర్, పిల్లల ఆట పరికరాలు, ఈపీడీఎం వాకింగ్ ట్రాక్, గజీబో లాంటి సుందరీకరణ పనులను గురువారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలంటూ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆరు ఎకరాల స్థలంలో రూ.11 కోట్లతో పార్క్‌ను సుందరీకరిస్తున్నామన్నారు. పార్కులో రూ.2 కోట్ల తో మ్యూజికల్ పౌంటెన్ తో పాటు ల్యాండ్ స్కేపింగ్‌తో చక్కటి గ్రీనరీ, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, ప్రజలు వాకింగ్ చేసేందుకు రూ.1.50 కోట్ల తో 600 మీటర్ల పొడవైన ఈపీడీఎం వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే నగరంలో 25 పార్క్‌లను అభివృద్ధిచేశామని, 14 వ డివిజన్‌లోని రాజీవ్ పార్క్‌ను కూడా ఈ నెల చివరికల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నాయకులు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కచ్చు రవి, ఈఈ యాదగిరి, ఆర్వీ అధికారి మురళి కృష్ణ, ఏజెన్సీ కాంట్రాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా అంజలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న అంజలి

కొత్తపల్లి: కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా 4వ వార్డు కౌన్సిలర్ జెరిపోతుల అంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో సభ్యులు అంజలికి పూర్తి మద్దతు ప్రకటించడంతో వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా గతంలో కొనసాగిన 2వ వార్డు కౌన్సిలర్ బండ రాధ మరణంతో వైస్ చైర్‌పర్సన్ పదవి ఖాళీగా ఉంది. ఇటీవల ఎన్నికల కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌కోసం నోటిఫికేషన్ విడుదల చేయగా గురువారం ఎన్నిక నిర్వహించారు. మున్సిపల్‌లో 12మంది కౌన్సిలర్లు ఉండగా 2వ వార్డు కౌన్సిలర్ మరణించడంతో 11 మంది కౌన్సిలర్లు ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఎన్నికకు ఏడుగురు కౌన్సిలర్లు హాజరుకాగా కోరం సరిపోవడంతో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు 4వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న జెరిపోతుల అంజలిని వైస్ చైర్మన్‌గా ప్రతిపాదించగా 10వ వార్డు కౌన్సిలర్ గందు రాంబాబు మద్దతు తెలిపారు. ఎన్నికకు హాజరైన సభ్యులు అంజలిని వైస్ చైర్‌పర్సన్‌గా మద్దతు తెలుపడంతో ఏకగ్రీవమైంది. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్డీవో అంజలికి అందజేశారు.

హర్ ఘర్ తిరంగా అభియాన్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు తలపెట్టిన హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని గురువారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 14వరకు తిరంగా యాత్ర చేపట్టాలన్నారు. 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆగస్టు 12 నుంచి 14వరకు మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆగస్టు 14న విభజన గాయాల స్మారక దినం జరపాలని, ఆగస్టు 13 నుంచి 15వరకు అమర వీరుల స్మారక చిహ్నాల వద్ద పుష్పాంజలి ఘటించాలని వివరించారు. ఈ సమావేశంలోబీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, బంగారి రాజేంద్రప్రసాద్, ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన చింతపండు ఝాన్సీ(19) ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఝాన్సీ కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఈ క్రమంలో నొప్పి ఎక్కువవడంతో గురువారం ఇంటి వద్దే క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబసభ్యులు తొలుత పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

జగిత్యాలలో నిప్పంటించుకొని వ్యక్తి..

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని సాయిరాంనగర్‌కు చెందిన గోకులకొండ రామస్వామి(54) ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రామస్వామి రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటినుంచి అతనికి మానసిక పరిస్థితి సరిగా ఉండటం లేదు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో బెడ్‌షీట్‌కు నిప్పంటించుకొని, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్సూర్‌ఖాన్ పేర్కొన్నారు.

పొలంలో జారిపడి రైతు మృతి


సమ్మయ్య (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పొలంలో జారిపడి ఓ రైతు మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దపల్లి మండలంలోని మూలసాలకు చెందిన నర్ర సమ్మయ్య(40) బుధవారం పొలంలో ఎరువు చల్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పని పూర్తయ్యాక ఇంటికి వచ్చే క్రమంలో పొలం గట్టు పైనుంచి జారి పడ్డాడు. అతను రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా బురదలో సమ్మయ్య మృతదేహం కనిపించింది. బురదలో కూరుకుపోయి ఊపిరాడక చనిపోయి ఉంటాడని బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు. గురువారం వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

ఇల్లందకుంట(హుజూరాబాద్): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఇల్లందకుంట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇల్లందకుంటకు చెందిన కందాల శ్రీనివాస్(42) గురువారం ఉదయం ఇంట్లో బోర్ మోటార్ రిపేర్ చేస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించి, స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య నవత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయం.. వరద కాలువ

- 'ఎల్లంపెల్లి' నీరు సూరమ్మ రిజర్వాయర్‌కు చేరకపోతే..
- కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా నింపాలని నిర్ణయం
- రూ.550 కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఇంజినీరింగ్ అధికారులు
- పనులు పూర్తయితే వేములవాడ రైతులకు మేలు
- నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు


కలిగోట శివారులోని సూరమ్మ రిజర్వాయర్

కథలాపూర్(వేములవాడ): వేములవాడ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగు నీరందించాలన్న లక్ష్యంతో కథలాపూర్ మండలంలోని కలిగోట శివారులో సూరమ్మ రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. ఎల్లంపెల్లి ఎత్తిపోతల పథకం ద్వారా ఇందులోకి నీళ్లు చేరుతాయి. అయితే, కొన్ని సందర్భాల్లో చివరగా ఉన్న సూరమ్మ రిజర్వాయర్‌లోకి చేరకపోతే ప్రత్యామ్నాయంగా ఎస్సారెస్పీ వరద కాలువ(కాళేశ్వరం రివర్స్ పంపింగ్ వాటర్) నుంచి ఎత్తిపోతల ద్వారా పంపించాలని ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రణాళిక రూపొందించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులు అనుకున్నట్లు జరిగితే రిజర్వాయర్‌లో అన్ని సీజన్లలో నీళ్లుంటాయని, పంటల సాగుకు ఢోకా ఉండదని, ఈ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఎస్సారెస్పీ వరద కాలువ

ఎత్తులో రిజర్వాయర్..

ఎస్సారెస్పీ వరద కాలువ కథలాపూర్ మండలంలో పెగ్గెర్ల, కథలాపూర్, దూలూర్, తక్కళ్లపెల్లి గ్రామాల మీదుగా వెళ్తుంది. సూరమ్మ రిజర్వాయర్ ఎత్తులో ఉండటంతో అందులోకి నీళ్లు చేరడం కష్టం. అందుకే కాలువ ద్వారా ఎత్తిపోతల విషయమై అధికారులు సర్వే చేశారు. దుంపేట నుంచి కలిగోట సూరమ్మ రిజర్వాయర్ వరకు 10.5 కిలోమీటర్లు, వరద కాలువ నుంచి చింతకుంట శివారు లక్కాకుల చెరువు వరకు 6.5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ పనులకు గానూ రూ.550 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, పనులు త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆలోచన మంచిదే..



వరద కాలువ ద్వారా సూరమ్మ రిజర్వాయర్‌తోపాటు ఎత్తు ప్రాంతాలకు నీళ్లందించాలన్న ఆలోచన మంచిదే. రిజర్వాయర్ పేరిట పాలకులు జాప్యం చేస్తున్నారు. పనులను ప్రభుత్వం త్వరగా పూర్తి చేయించాలి. అప్పుడే రైతులకు సాగునీటి సమస్య తీరుతుంది.

– రాజారెడ్డి, రైతు, భూషణరావుపేట

త్వరగా పూర్తి చేయాలి



నీటి సమస్య వల్ల పంటల సాగు తగ్గిపోయింది. సూరమ్మ రిజర్వాయర్‌తోపాటు కాలువ పనులు పూర్తయితే మూడు మండలాలకు సాగు నీరందుతుంది. రైతులకు మేలు చేసే అంశాలకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే మాకు మేలు జరుగుతుంది.

– జలంధర్‌రెడ్డి, రైతు, తాండ్ర్యాల

ప్రతిపాదనలు పంపాం

ఎస్సారెస్పీ వరద కాలువ నుంచి కలిగోట శివారులోని సూరమ్మ రిజర్వాయర్‌కు నీళ్లు చేరేలా ఎత్తిపోతల పనులకు రూ.550 కోట్లతో ప్రతిపాదనలు చేశాం. ఈ మేరకు ఈఎన్‌సీకి నివేదిక అందించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పనులు చేపడుతాం.

– సంత్ ప్రకాశ్‌రావు, నీటిపారుదలశాఖ ఈఈ, ఎల్లంపెల్లి ఎత్తిపోతల విభాగం

వేతనం ఇస్తలేరు.. అడిగితే కొడుతున్నరు

- సౌదీలో కొలనూర్‌వాసి ఇబ్బందులు
- ఇండియాకు రప్పించండి
- సీఎం రేవంత్‌రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్‌కు సోషల్ మీడియా ద్వారా వేడుకోలు


సౌదీలో అంజి

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం ఊరు విడిచి సౌదీ వచ్చాను.. ఇక్కడి కంపెనీ యాజమాన్యం వేతనం చేతికి ఇస్తలేరు.. అడిగితే దూషిస్తూ కొడుతున్నరు.. నా ఏటీఎం లాక్కున్నరు.. అకౌంట్‌లో డబ్బులు వేస్తూ డ్రా చేసుకుంటున్నరు.. ఎవరైనా అడిగితే జీతాలు ఇస్తున్నమని చెబుతున్నరు.. నరకం చూస్తున్న.. మరో 18 మంది కార్మికులదీ ఇదే పరిస్థితి. తనను ఇండియాకు రప్పించండి అంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన మేరుగు అంజి కోరుతున్నాడు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి, తాను స్వగ్రామం చేరేలా చర్యలు తీసుకోవాలని గురువారం సోషల్‌మీడియా వేదికగా వేడుకున్నాడు. బాధితుడి వివరాల ప్రకారం.. కొలనూర్ గ్రామానికి చెందిన మేరుగు దేవయ్య–మల్లవ్వ దంపతుల కుమారుడు అంజి ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లాలనుకున్నాడు. ముంబై బైకల్ ప్రాంతంలోని విజయ్ గల్ఫ్ ఆఫీస్‌లో రూ.1.5 లక్షలు చెల్లించాడు. ఇతనితోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన 18 మంది డబ్బులిచ్చారు. గత మార్చిలో సౌదీ వెళ్లాక ముందు చెప్పినట్లు అక్కడి అల్‌బరా కంపెనీలో కాకుండా వేరే కంపెనీలో డ్రైవర్ ఉద్యోగం ఇచ్చారు. పాత వాహనాల్లో 70 నుంచి 80 టన్నుల సామగ్రి పంపిస్తున్నారు. వాహనానికి ఏమైనా జరిగినా, పోలీసులు పట్టుకున్నా వీరిదే బాధ్యత. 5 నెలలుగా జీతం ఇవ్వడం లేదు. తిండి కోసం రూ.200 ఇస్తున్నారు. వేతనం అడిగితే దూషిస్తూ కొడుతున్నారు. ఏటీఎం కార్డులు లాక్కొని, ఖాతాల్లో డబ్బులు వేసి, మళ్లీ డ్రా చేసుకుంటున్నారు. నరకయాతన అనుభవిస్తున్నానని తనను ఇండియాకు రప్పించాలని అంజి కోరుతున్నాడు.

మా కొడుకు వచ్చేలా సూడాలె



సౌదీ వెళ్లిన మా కొడుకు అక్కడ నరకం సూత్తండు. జీతం ఇయ్యమంటే కొడుతుండ్రట. మాకు భయమైతంది. మేము, మా కోడలు సోని ఏడ్వని రోజు లేదు. మనవళ్లు అక్షిత్, చెర్రీ నాన్న కావాలని అడుగుతున్నరు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే సార్లు మా కొడుకు ఇంటికి వచ్చేలా సూడాలె.

– మల్లవ్వ–దేవయ్య, అంజి తల్లిదండ్రులు

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

- కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నడవడికను గమనించాలి
- జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం: ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా విద్యార్థులందరూ స్నేహపూర్వకంగా ఉంటూ విద్యనభ్యసించాలని సూచించారు. ర్యాగింగ్ వంటి కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు కోల్పోతారన్నారు. వ్యసనాలకు బానిస కావొద్దని, సరదాలకు పోయి, కష్టాలను కొని తెచ్చుకోవద్దని పేర్కొన్నా రు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సీనియర్లు ఇబ్బంది పెడితే జూనియర్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు ఫిర్యాదు చేయాలన్నారు. యాజమాన్యాలు కూడా విద్యార్థుల నడవడికను గమనించాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే డయల్ 100కు కాల్ చేసి, పోలీసుల సహాయం పొందాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనందున అన్ని విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులు నిర్వహించాలని, యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

'మిడ్‌మానేరు'లో బోటు కలకలం

- కొట్టుకు వచ్చిందా? అక్కడ ఎవరైనా ఉంచారా?
- స్థానికంగా చర్చనీయాంశం


మిడ్‌మానేరు ప్రాజెక్టు నీటిలో బోటు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక మిడ్‌మానేరు ప్రాజెక్టులో ఉన్న ఓ బోటు స్థానికంగా కలకలం రేపుతోంది. అది కొట్టుకు వచ్చిందా? ఎవరైనా అక్కడ ఉంచారా అన్నది చర్చనీయాంశమైంది. ముంపు గ్రామాలైన కొదురుపాక, నీలోజిపల్లి వెళ్లే దారిలో ఓ చెట్టుకు ఆనుకొని, బోటు ఉందని పలువురు చెబుతున్నారు. 10 రోజులుగా అలాగే ఉంటోందని మత్స్యకారులు అంటున్నారు. గతంలో పర్యాటకంలో భాగంగా సిరిసిల్ల రామప్ప గుట్టల పరిసరాల్లో రెండు బోట్లు సమకూర్చారని కొందరు పేర్కొంటున్నారు. కొన్ని రోజులుగా ఎల్లంపల్లి నీరు వదలడంతో మిడ్‌మానేరు ప్రాజెక్టులో 17 టీఎంసీలకు చేరింది. ఈ క్రమంలో అక్కడి బోటు కొట్టుకువచ్చి ఉంటుందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. బోటు ధర రూ.లక్షల్లో ఉంటుందని తెలిసింది. అంత విలువైంది ఇక్కడ ఎందుకుందన్న చర్చ జరుగుతోంది.

సీఐ కుటుంబానికి చేయూత

- రూ.16 లక్షలు అందించిన తోటి సీఐలు


చెక్కు అందిస్తున్న సీఐలు సృజన్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, స్వామి

కరీంనగర్ క్రైం: తమతో పని చేసిన సీఐ మృతిచెందగా బాధిత కుటుంబానికి తోటి సీఐలు అండగా నిలిచారు. గురువారం కరీంనగర్‌లో రూ.16.80 లక్షల ఆర్థికసాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ ఆటోనగర్‌కు చెందిన సైరి రాజేశ్(42) 2007లో పోలీస్ శాఖలో ఎస్సైగా చేరారు. తర్వాత సీఐగా పదోన్నతి పొందారు. అనారోగ్యంతో గత ఫిబ్రవరిలో చనిపోయారు. ఆయనకు భార్య రాధ, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. రాజేశ్ కుటుంబానికి తమవంతుగా అండగా నిలవాలని తోటి సీఐలు నిర్ణయించుకున్నారు. రూ.16.80 లక్షల చెక్కు అందించారు. కార్యక్రమంలో సీఐలు సృజన్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, ఎల్ఎండీ ఇన్‌స్పెక్టర్ స్వామి పాల్గొన్నారు.

పూడూర్‌వాసిని స్నేహితులే చంపారు

- పాత గొడవలు చర్చకు వచ్చి, క్షణికావేశంలో హత్య
- మూడు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులు


అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. స్నేహితులే చంపినట్లు తేల్చారు. కొడిమ్యాల ఠాణాలో డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. పూడూర్‌కు చెందిన రాజశేఖర్ గౌడ్, కమల్, గొర్రెగుండం గ్రామానికి చెందిన తిరుపతి స్నేహితులు. గొడవల కారణంగా రాజశేఖర్ గౌడ్, కమల్ కొన్ని రోజులుగా మాట్లాడుకోవడం లేదు. ఈ క్రమంలో 10 రోజుల క్రితమే మాటలు కలిశాయి. ఈ నెల 4వ తేదీ ఆదివారం కమల్, తిరుపతి పూడూరులోని బీరప్ప ఆలయ సమీపంలో బీర్లు తాగుతున్నారు. ఆ సమయంలో రాజశేఖర్ గౌడ్ కూడా వచ్చి, వారితో కలిసి మద్యం సేవించాడు. రాత్రి 11 గంటలకు అతను గతంలో జరిగిన గొడవల గురించి మాట్లాడాడు. దీంతో ముగ్గురూ గొడవ పడ్డారు. ఆగ్రహించిన కమల్, తిరుపతి క్షణికావేశంలో రాజశేఖర్‌గౌడ్‌పై కర్రలతో దాడి చేసి, పెట్రోల్ పోసి, కాల్చేశారు. తర్వాత గంగాధర గ్రామానికి వెళ్లి, రాజశేఖర్ ఏటీఎం కార్డుతో రూ.4,900 డ్రా చేసి, గొర్రెగుండం వెళ్లిపోయారు. హత్య కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు హంతకుల కోసం వేట ప్రారంభించారు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేసిన దృశ్యాలు, పూడూరు బెల్ట్‌షాపు వద్ద వివరాలు, మొబైల్ డేటా సేకరించి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కమల్, తిరుపతి గురువారం బైక్‌పై కరీంనగర్ వెళ్తుండగా పట్టుకున్నారు. విచారణలో తామే చంపినట్లు వారు అంగీకరించడంతో అరెస్టు చేశారు. మూడు రోజుల్లోనే కేసును ఛేదించిన మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

- 20 కోళ్లు మృతి


చనిపోయిన కోళ్లు


మొండయ్య తుంటిపై గాయాలు

పెద్దపల్లిరూరల్: భోజన్నపేటలో కుక్కలు భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. గురువారం కుక్కల దాడిలో గ్రామానికి చెందిన పల్లె మొండయ్యతోపాటు ముగ్గురు మహిళలకు గా యాలయ్యాయని తెలిపారు. పలువురి గేదెల కూ గాయాలయ్యాయని అన్నారు. ఇంటి వ ద్ద పెంచుతున్న 20 కోళ్లను చంపేశాయని పొన్నం రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి, వీధి కుక్కల బారినుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.


ఎల్లారెడ్డిపేటలో గాయపడిన చిన్నారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కుక్కల దాడిలో నలుగురు చిన్నారులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన మస్కూరి ప్రతీష, ఎర్పుల శ్రవణ్, తాడిపల్లి సహస్ర, మద్దుల వర్షిత్‌లు గురువా రం ఆడుకుంటున్నారు. అదే సమయంలో గుంపుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా వారిపై దా డి చేశాయి. గాయపడిన చిన్నారులను స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రి కి తరలించారు. కుక్కల కారణంగా భయంభయంగా బతుకుతున్నామని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా వాటిని దూరంగా తరలించాలని కోరుతున్నారు.

పాఠశాలలోకి పాము

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని వెల్లుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గదిలోకి గురువారం పాము వచ్చింది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నామని, ఆ సమయంలో తరగతి గది దర్వాజపై పాము కనిపించిందని తెలిపారు. విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు అటెండర్ ద్వారా పామును చంపించారని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



హుజూరాబాద్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది మంది వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు గుర్తించి, గురువారం సీఐ తిరుమల్ చేతులమీదుగా వారికి అప్పగించారు. రూ.1.50 లక్షల విలువైన 8 ఫోన్లను అప్పగించామని సీఐ తెలిపారు. ఫోన్లు పోయాయని ఎక్కువ ఫిర్యాదులు వస్తుండటంతో హుజూరాబాద్ పీఎస్‌లో ప్రత్యేకంగా టీం ఏర్పాటు చేశామన్నారు. టెక్నాలజీ ఉపయోగించి, వాటిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

చందుర్తి ప్యాక్స్ సీఈవోపై ఫిర్యాదు

చందుర్తి(వేములవాడ): రైతులకు సంబంధించిన రుణమాఫీ డబ్బులను సొంతానికి వాడుకున్న చందుర్తి ప్యాక్స్ సీఈవో గంగారెడ్డిపై జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణజ్యోతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం రుణమాఫీ చేసిన 37 మందికి చెందిన రైతులకు చెందిన రూ.32,24,554ను సొంతానికి వాడుకున్నట్లు విచారణలో సీఈవో ఒప్పుకున్నారని తెలిపారు. ఈ విషయమై చందుర్తి పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని, ఇంకా కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

జాతీయస్థాయి కళోత్సవాలకు రండి


మాట్లాడుతున్న స్వామి, శంకర్ తదితరులు

జ్యోతినగర్(రామగుండం): ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించాలన్న సదాశయంతో తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కళోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఇఫ్టా) జాతీయ సమితి నాయకులు కె.స్వామి, దామెర శంకర్ తెలిపారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని ఓ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌లో సంస్థ ఏర్పడిందన్నారు. అప్పటినుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వందల మంది కళాకారులను పరిచయం చేసి, విభిన్న కళారూపాల ప్రదర్శనకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, గోదావరిఖనివాసి సంకె రాజేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీల్లో ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం ఆడిటోరియంలో కళోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని, పలు రంగాల ప్రతిభావంతులను నల్ల వజ్రం అనే పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. మేకల శ్రీధర్ యాదవ్, కళాకారులు మేజిక్ రాజా, దయా నర్సింగ్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థి ఎ.అశ్వత్‌రావు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు, హెచ్‌సీఏవారు నిర్వహించే పలు టోర్నమెంట్లకు ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో అతన్ని అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రపంచ క్రీడల్లో క్రికెట్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. జిల్లా కేంద్రంలో క్రికెట్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లావారు నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థి అశ్వత్‌రావు సత్తా చాటాడని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

11న ఫుట్‌బాల్ మహిళల జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులను ఈ నెల 16 నుంచి నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. 2008కి ముందు జన్మించినవారు అర్హులని, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో స్టేడియంలో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు సంఘం ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యను 98491 14956 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సోషల్ మీడియాలో ఆరోపణలు

- వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం: సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేసిన ఓ వ్యక్తిపై కరీంనగర్ టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని వాసవి కాలనీకి చెందిన సీరుమల్ల శ్యాంసుందర్ చిట్టిమల్ల శ్రీనివాస్‌పై సోషల్ మీడియాలో ఆరోపణలు చేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోర్టు నుంచి అనుమతి తీసుకొని, శ్యాంసుందర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

యువతి బలవన్మరణం

- ప్రేమ పేరిట వేధింపులే కారణమని సూసైడ్ నోట్


అఖిల (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ప్రేమ పేరిట వేధించడం వల్లే చనిపోతున్నట్లు అంతకుముందు సూసైడ్ నోట్ రాసింది. ఎస్సై చేరాలు కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని పోరండ్లకు చెందిన మామిడి మొగిలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు అఖిల(20) ఇటీవల ఎంఎల్‌టీ కోర్సు పూర్తి చేసింది. హోటల్ నిర్వహణలో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటోంది. గురువారం సాయంత్రం వరకు హోటల్లోనే ఉండి, ఇంటికి వెళ్తానంటూ చెప్పి, వెళ్లిపోయింది. తర్వాత తల్లి చాలాసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అనుమానం వచ్చి వెళ్లగా ఇంట్లోనే ఉరేసుకొని కనిపించింది. ఆమె అరుపులకు చుట్టుపక్కలవారు వచ్చి, తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే అఖిల చనిపోయింది. అక్కడే ఒక బుక్‌లో తన చావుకు ముగ్గురు వ్యక్తులు కారణమంటూ లెటర్ రాసింది. గ్రామానికే చెందిన అంగోతు భరత్ ప్రేమ పేరిట వేధిస్తున్నాడని, అతని కుటుంబసభ్యులు కోటయ్య, విజయ సైతం ఫోన్లు చేసి, వేధించారని, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొంది. వారిని కఠినంగా శిక్షించాలని కోరింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• అభిప్రాయం



'అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలాహ్యారిస్ గెలుస్తుంది. ఆమె గెలుపు మహిళాశక్తిని నిరూపిస్తుంది' అంటున్నారు **లత మంగిపూడి.** అమెరికాలోని న్యూహ్యాంప్‌షైర్‌కు డెమోక్రటిక్ పార్టీ లెజిస్లేటర్‌గా ఉన్న లత ప్రస్తుతం కమలా హ్యారిస్ గెలుపు కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారు. అమెరికా మహిళల గురించి స్త్రీలకు ఉండాల్సిన దృక్పథం గురించి ఆమె తన అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

హ్యారిస్ గెలిచి మహిళాశక్తిని గెలిపిస్తుంది

'ఒక విధంగా చెప్పాలంటే అమెరికాలో ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. అమెరికన్స్ మరోసారి ట్రంప్ నియంతృత్వ పాలనను అంగీకరించేందుకు ఏ మాత్రం సిద్ధంగా లేరు. కమలా హ్యారిస్ గెలిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ. అందుకే 'సేవ్ అవర్ డెమోక్రసీ' అనే నినాదంతో మేం ప్రజల్లోకి వెళ్తున్నాం. కమలా హ్యారిస్ అమెరికా మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడతారని బలంగా నమ్ముతున్నాను' అన్నారు లత మంగిపూడి.

మైసూరుకు చెందిన లత రాజమండ్రికి చెందిన కృష్ణ మంగిపూడిని వివాహం చేసుకోవడంతో ఆంధ్రప్రదేశ్ వాసి అయ్యారు. 1985లో యూఎస్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అనంతరం యూఎస్ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ న్యూహ్యాంప్‌షైర్ చాప్టర్‌కు 2006 నుంచి 2013 వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగారు. అలా ఆమె రాజకీయ జీవితం మొదలైంది. అప్పటి అధ్యక్షుడు ఒబామా, హిల్లరి క్లింటన్ వంటి ప్రముఖులతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత 2013 నుంచి ఇప్పటివరకు నాషువా నుంచి లెజిస్లేటర్‌గా గెలుపొందుతూనే ఉన్నారు. కమలాహ్యారిస్ గెలుపు కోసం హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తూ పర్యటనలు చేస్తున్నారు.



కమలా హ్యారిస్‌తో లత మంగిపూడి

స్త్రీల హక్కులకు విఘాతం

'ప్రపంచంలో ఏ మహిళకైనా తన శరీరంపై తనకు పూర్తి హక్కు ఉండాలి. ఆమె తన ఆరోగ్యాన్ని కాపాడుకొనే అవకాశం ఉండాలి కదా. కానీ అమెరికాలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల్ని కనాలా, వద్దా అనే అత్యంత కీలకమైన అంశంపైన మహిళలు తమ హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గర్భం దాల్చిన తరువాత తప్పనిసరిగా బిడ్డను కనాల్సిందే. కానీ బిడ్డను కనేందుకు ఆమె మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యరీత్యా సంసిద్ధంగా ఉండాలి. ఇది బిడ్డను కనాల్సిన తల్లి, డాక్టర్ నిర్ణయించవలసిన విషయం. ఇందులో ప్రభుత్వ జోక్యం అవసరం లేదు. కానీ బలవంతంగానైనా పిల్లలను కనాల్సిందేననడం సరి కాదు. అత్యాచారానికి గురైన వారు, లైంగిక దాడుల వల్ల గర్భవతులైన వాళ్లు కూడా బిడ్డల్ని కనాలంటే ఎలా? అమెరికా మహిళలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న ఈ అంశంపై డెమోక్రటిక్ పార్టీ స్పష్టమైన వైఖరిని కలిగి ఉంది. మా పార్టీ గెలిస్తేనే మహిళల హక్కులకు రక్షణ లభిస్తుంది' అన్నారామె.

ఇంకా వివక్షేనా....

'విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు లభించడం లేదు. స్త్రీలు తీవ్ర నిర్లక్ష్యానికి, వివక్షకు గురవుతున్నారు. చివరకు కొన్నిచోట్ల ఓటు హక్కును కూడా వినియోగించుకోలేని పరిస్థితి. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకొనే వాతావరణానికి రిపబ్లికన్ పార్టీ విఘాతం కలిగిస్తోంది. ముఖ్యంగా కొత్తగా ఓటుహక్కును పొందిన వాళ్లు, ఇమ్మిగ్రెంట్స్, కొన్నిచోట్ల మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకొనే అవకాశం లేదు. ఆ పార్టీ మరోసారి గెలిస్తే ఓటుహక్కు మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే ఈసారి మహిళా గెలుపు ప్రజాస్వామిక గెలుపు' అని ముగించారామె.

- పగిడిపాల ఆంజనేయులు
సాక్షి, హైదరాబాద్

మీరూ మీ వార్డ్రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్రోబ్ శీర్షికన ప్రచురిస్తాం. మా చిరునామా: మై వార్డ్‌రోబ్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. sakshifamily3@gmail.com

మై వార్డ్‌రోబ్





హస్త కళలపై ఇష్టంతో చిత్రలేఖనం, బ్లాక్ ప్రింటింగ్ నేర్చుకుంది. చదివింది ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్. చేనేత కారులకు అండగా ఉండాలని చర్ఖా సంస్థను ప్రారంభించింది. మువ్వన్నెల జెండా రంగులు... మధ్యన మన సంస్కృతికి చిహ్నమైన ముగ్గును చిత్రించి, చేనేత వస్త్రంతో కండువాను డిజైన్ చేసింది. పేటెంట్ హక్కునూ పొందింది. తన హ్యాండ్లూమ్ చీరలను ధోతీ కట్టులా డిజైన్ చేసి, వాటినే తన రోజువారీ డ్రెస్‌గా మార్చుకుంది. సికింద్రాబాద్ మారేడుపల్లిలో ఉంటున్న ప్రతిమ రాపర్తి తన వార్డ్‌రోబ్‌ను సరికొత్తగా మార్చుకుంది.

ధోతీ కట్టు
మూడు రంగుల్లో ముగ్గు

'ప్రపంచానికి కాటన్ దుస్తులను మన దేశమే పరిచయం చేసింది. మనదైన సంస్కృతిని మనమే పరిచయం చేసుకోవాలి. అలాగే మనల్ని అందరూ గుర్తించాలి. ఈ ఆలోచనే చేనేతలకు దగ్గరగా ఉండేలా చేసింది. 2018లో 'చర్ఖా' పేరుతో చేనేతలకు మద్దతుగా నిలవాలని సంస్థను ప్రారంభించాను.

ట్రై కలర్స్‌లో ముగ్గు

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ట్రై కలర్స్ డ్రెస్ ధరించి వెళ్లడానికి చాలా కష్టపడేదాన్ని. ఆరెంజ్, బ్లూ, గ్రీన్ కలర్స్ ఉండేలా డ్రెస్సింగ్ చేసుకునేదాన్ని. అలా కాకుండా ఆ రోజుకి ఏదైనా ప్రత్యేకమైన యునిఫామ్ ఉంటే బాగుంటుంది అనుకున్నాను. చేనేత క్లాత్‌ను ఎంపిక చేసుకొని, అంచుగా వాటికి నేచురల్ కలర్స్‌ని జత చేశాను. మూడు రంగుల మధ్యలో ఉండే ధర్మచక్ర మన అడ్మినిస్ట్రేషన్‌కి, విజడమ్‌కి ప్రతీక. ధర్మచక్రను మన డ్రెస్సుల్లో వాడకూడదని, దాని బదులుగా ముగ్గు డిజైన్ చేశాను. ముగ్గు అనేది మన సంస్కృతికి, స్త్రీల కళా హృదయానికి ప్రతీక.

25 చుక్కలు...

మధ్య చుక్క ఈ డ్రెస్ ఎవరు ధరిస్తారో వారికి ప్రతీక. మిగతా 24 చుక్కలు మన పూర్వీకులు, కాలానికి ప్రతీకగా అనుకోవచ్చు. అలాగే, ఆ చుక్కలన్నీ కలుపుతూ వెళితే మన సమాజ వృద్ధికి, రాబోయే తరానికి సూచికగానూ ఉంటాయి. ఈ డిజైన్‌ని కండువా, శారీ, ధోతీ, ఘాగ్రా చోళీకి తీసుకున్నాను. దీనికి పేటెంట్ రైట్ కూడా తీసుకున్నాను. ఈ డిజైన్ కండువాను ఎవరైనా ధరించవచ్చు.

చేనేత చీరలతో ధోతీ కట్టు

నా దగ్గర ఎక్కువగా ఉన్న హ్యాండ్లూమ్ చీరలని ప్రత్యేక కట్టుగా మార్చుకోవాలనుకున్నాను. సౌకర్యంగా ఉండేలా చీరలను ధోతీగా కన్వర్ట్ చేసుకున్నాను. సెల్, మనీ, కార్డ్స్ పెట్టుకోవడానికి ఈ ధోతీకి పాకెట్స్ కూడా ఉంటాయి. పూర్వం రోజుల్లో గోచీకట్టు చీరలను వాడేవారు. ఆ డిజైన్ ప్రతిఫలించేలా నాకు నేను కొత్తగా డిజైన్ చేసుకున్న డ్రెస్సులివి. టూర్లకు, బయటకు ఎక్కడకు వెళ్లినా ఇలాంటి డ్రెస్‌తోనే వెళతాను. నాకు నేను ప్రత్యేకంగా ఉండాలనుకుంటాను. వీవర్స్, టైలర్స్, బ్లాక్‌ప్రింట్, హ్యాండ్‌క్రాఫ్ట్స్ వారితో కలిసి వర్క్ చేస్తాను. ఇకో ఫ్రెండ్లీ హ్యాండీ క్రాఫ్ట్, టైలరింగ్, పెయింటింగ్... వంటివి గృహిణులకు నేర్పిస్తుంటాను'' అని వివరించారు ప్రతిమ.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



• ఒలింపిక్ లెజెండ్

సింహం మెడలో మేక...

విమర్శలకు చాలా మంది కుంగిపోతుంటారు. అమెరికన్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్ అయిన సిమోన్ అరియన్నే బైల్స్ ఓవెన్స్ మాత్రం విమర్శలనే సవాల్‌గా తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇటీవల జరిగిన ఆల్‌రౌండ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. దీంతో తొమ్మిది ఒలింపిక్ పతకాలు, 30 ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు ఆమె ఖాతాలో చేరి, ప్రపంచంలోనే అత్యధిక ఒలింపిక్ పతకాలు సాధించిన ఐదవ మహిళా ఒలింపిక్ జిమ్నాస్ట్‌గా పేరొందిందామె. 27 ఏళ్ల సిమోన్ విజయం సాధించిన వెంటనే తన మెడలో మేక లాకెట్టుతో ఉన్న చైన్‌ను బయటకు తీసి అందరికీ చూపించింది. 'చాలా మంది నన్ను 'గోట్' అని పిలుస్తుంటారు. నేను దానిని నెగిటివ్‌గా తీసుకోలేదు. ఈ గోట్‌లో కూడా ప్రత్యేకత ఉంది, అది ప్రపంచానికి చూపించాలనుకున్నాను. అందుకే 'స్టఫ్డ్ గోట్'ను హారంగా మెడలో ధరించాను' అంటూ గోట్ లాకెట్‌ను చేత్తో పట్టుకొని చూపిస్తూ అంది సిమోన్ బైల్స్.

తొమ్మిదవ ఒలింపిక్ పతకాన్ని, ఆరవ స్వర్ణాన్ని సంపాదించినందుకు సిమోన్ ప్రదర్శనలో అభినందనలు దక్కాయి. అయితే, 2021లో జరిగిన టోక్యో గేమ్స్ నుండి చివరి నిమిషంలో వైదొలగడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె చేష్టల కారణంగా మరొక క్రీడాకారిణికి అవకాశం లేకుండా పోయిందని, జాత్యహంకారం, సెక్సిస్ట్, ట్రాన్స్‌ఫోబిక్, డ్రగ్ చీట్... అని ఎంతో మంది చేత నాడు విమర్శలను ఎదుర్కొంది. దీంతో కుటుంబంలో వచ్చిన సమస్యలు, మానసిక సమస్యలతో పోటీల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. అయినా ఆమెపైన విమర్శలు ఆగలేదు. ఆ సందర్భంలో ఆమెను 'గోట్' అంటూ హేళన చేశారు. అదే ఆమె ఇప్పుడు తన బలంగా మార్చుకుని, దాంతోనే పతకాన్ని సాధించ గలిగింది.



యారోస్లావా మహుచిక్

ఫీనిక్స్

యుద్ధం ఆమెకు సలాం చేసింది

ఉక్రయిన్ పై రష్యా బాంబుల వర్షం కురిపిస్తూనే ఉంది. కాని ఆ దేశం నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు పతకాలు గెలిచి యుద్ధాన్ని చిన్నబుచ్చుతూనే ఉన్నారు. హైజంప్‌లో బంగారు పతకం సాధించిన యారోస్లావా ఏ క్షణంలో ఏ వార్త వినవలసి వస్తుందో అన్న ఆందోళనలో కూడా లక్ష్యాన్ని తప్పలేదు. యుద్ధం ఆమెకు సలాం చేసింది.

యుద్ధం చేసిన గాయంతో ఇంకా ఆ దేశం కన్నీరు కారుస్తూనే ఉంది. బాంబులు, బుల్లెట్లు చిందించిన రక్తంతోనే అక్కడి ప్రజలు ఇప్పటికీ సూర్యోదయాన్ని చూస్తున్నారు. రష్యా దురాక్రమణతో ఉక్రెయిన్ ధ్వంసమయ్యి రెండేళ్లు దాటింది. కాని ఆ దేశ క్రీడాకారుల మనోబలాన్ని మాత్రం యుద్ధం దెబ్బతీయలేకపోయింది. మీరు మాపై తుపాకులు ఎక్కుపెట్టి యుద్ధం చేస్తే.. మేం బంగారు పతకాలతో శాంతి సందేశాన్ని అందిస్తామంటూ ప్రపంచానికి సగర్వంగా చాటి చెబుతున్నారు ఉక్రెయిన్ క్రీడాకారులు. హై జంప్‌లో బంగారు పతకం సాధించిన 22 యేళ్ల యారోస్లావా మహుచిక్ వారిలో ఒకరు.

నిలువనీడ లేకపోయినా...



ప్రశాంతంగా సాగుతున్న యారోస్లావా జీవితాన్ని యుద్ధం ఆందోళనలో పడేసింది. నిత్యం దూసుకొచ్చే క్షిపణులు ఆమెకు రెండున్నరేళ్లుగా నిలువ నీడలేకుండా చేశాయి. తూర్పు ఉక్రెయిన్‌లోని సొంతూరు నిప్రో నుంచి బయటపడి వివిధ దేశాల్లో తలదాచుకుంది. తల్లీతండ్రి అక్క అప్పుడప్పుడూ తనను కలిసేందుకు వచ్చేవారు. వారిని చూశాక ఆమె మనసు మరింత కకావికలమయ్యేది. వారు వెళ్లిపోయాక ఏ క్షణాన ఏ వార్త వినాల్సిందోనన్న భయం ఆమెను వెంటాడేది. ఇంట్లో ఉన్నపుడు పక్కన బాంబులు పడుతుంటే 'నాన్నా బేస్‌మెంట్‌లోకి వెళ్దామా అంటే.. ఇంకా భయపడి పారిపోవడంలో అర్థం లేదు. నాలాగే ఎంతోమంది ప్రాణాల మీద ఆశలు వదిలేసుకునే బతుకుతున్నారు తల్లీ' అన్న తండ్రి మాటలు వద్దంటున్నా గుర్తుకువచ్చేవి. యుద్ధం ఆమెను వెంటాడుతూనే ఉండేది. నేలకొరుగుతున్న దేశ సైనికులు..రోడ్డున పడుతున్న ఉక్రెయిన్ ప్రజలు కళ్ల ముందు కదులుతూనే ఉన్నారు. వాటి మధ్యే ఆమె శిక్షణ కొనసాగిస్తూ వచ్చింది.

విషాదగీతాలు మరిచేలా...

స్లీపింగ్ బ్యాగ్, యోగా మ్యాట్‌ను ఎప్పుడూ తనతో తెచ్చుకునే మహుచిక్ ఆట విరామ సమయంలో స్టేడియంలో విశ్రాంతి తీసుకుంటూ ఆకాశంలోకి చూస్తూ దేశం గురించే ఆలోచించేది. యుద్ధ విషాద గీతాలు మరుగున పడేలా ప్రజల్లో చైతన్యం నింపేలా దేశానికి పతకం అందించాలని కలలు కనేది. హైజంప్ మ్యాచ్‌లో ప్రత్యర్థితో తలపడే సమయంలోనూ ఆమె మనసు నిండా యుద్ధ దృశ్యాలే. చివరకు ఆమె పోరాట స్ఫూర్తి గెలిచింది. ఎంతటి భీకర యుద్ధమైనా ఆశలను, ఆశయాలను తుడిచిపెట్టేయలేదని నిరూపించింది. వ్యక్తిగత హోదాలో దేశానికి ఆమె సాధించిపెట్టిన తొలి గోల్డ్‌మెడల్ ఉక్రెయిన్ ప్రజల భవిష్యత్తుకు నిజంగా ఓ ఆశా కిరణమే. యారోస్లావా మహుచిక్ ఒక్కరే కాదు.. పారిస్ ఒలంపిక్స్‌లో పతకాలు సాధిస్తున్న ఇతర ఉక్రెయిన్ క్రీడాకారులు యుద్ధం కారణంగా నిస్సత్తువగా మారిన ఆ దేశ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఇంతకాలం యుద్ధం కారణంగా రక్తంతో తడిసిన దేశంలో పతకాల సుమాలు పూయిస్తున్నారు.

ఒలింపిక్స్ జరుగుతున్నా...

''ఒలింపిక్ క్రీడలు శాంతి సందేశాలు. కానీ రష్యా ఇలాంటి క్రీడలు జరుగుతున్న సమయంలోనూ మా దేశంపై దాడులు ఆపకపోగా మరింత ఉధృతం చేసింది. చిన్నపిల్లల ఆసుపత్రిపై క్షిపణులు కురిపించడంలోని క్రౌర్యం మాటలకందనిది'' అంది యారోస్లావా మహుచిక్.

ఒలింపిక్స్ క్రీడాకారులు
ఏం తినాలి! ఎంత తినాలి!!



హెల్దీ డైట్

వంద గ్రాములు... మనదేశానికి ఒక బంగారు పతకాన్ని దూరం చేసింది. బంగారు పతకంతో పాటు బంగారంలాంటి క్రీడాకారిణి మనోధైర్యాన్ని దెబ్బతీసింది. బరువు లెక్కలు ఇంత కచ్చితంగా పాటించే ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తీసుకునే ఆహారం ఎలా ఉండాలనే వివరాలను అందించారు న్యూట్రిషనిస్ట్, వెల్‌నెస్ కోచ్ డాక్టర్ కరుణ.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒలింపిక్స్ క్రీడాకారుల ఆహారం చాలా నిశితమైన పరిశీలనతో డిజైన్ చేస్తారు. వాళ్ల ఆరోగ్యం, సంబంధిత క్రీడకు అవసరమైన మోతాదులో పోషకాలు సమృద్ధిగా అందేలా ఆహారం ఉంటుంది. కేలరీలు, కార్బోహైడ్రేట్‌లు, ప్రోటీన్‌లు, ఫ్యాట్స్ వంటి మ్యాక్రో న్యూట్రియెంట్స్, ఐరన్, క్యాల్షియం, విటమిన్ డీ, మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్స్ (సోడియం, పొటాషియం, క్లోరైడ్) వంటి మైక్రో న్యూట్రియెంట్‌లు అందాలి. క్రీడాకారుల డైట్‌లో దేహానికి ఒక రోజుకు అవసరమైన కేలరీలలో 55-65 శాతం కార్బోహైడ్రేట్‌ల రూపంలోనే ఉంటుంది. శ్రమను బట్టి రోజుకు 2 వేల నుంచి 10 వేల కేలరీల వరకు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రొటీన్‌లు దేహం బరువును బట్టి కేజీకి 1.2 నుంచి 2 గ్రాములు అందాలి. ఆరోగ్యకరమైన ఫ్యాట్ శక్తినివ్వడంతో పాటు హార్మోన్ ఉత్పత్తికి దోహదం చేస్తుంది. దేహానికి అందాల్సిన కేలరీల్లో 20 నుంచి 30 శాతం ఫ్యాట్ రూపంలో ఉండాలి. మారథాన్, స్విమ్మింగ్‌కి శిక్షణ నిడివి ఎక్కువ ఉంటుంది. క్రీడను బట్టి కూడా పోషకాల అవసరం మారుతుంది.

హార్మోన్‌ల సమతుల్యత!

వీటన్నింటితోపాటు నిద్ర, ఒత్తిడి చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. క్రీడాకారిణులకు ఎనిమిది గంటల మంచి నిద్ర తప్పనిసరి. నిద్రలేనప్పుడు హార్మోన్‌ల సమతుల్యత లోపించడం, ఒత్తిడి, బరువు మీద ప్రభావం చూపిస్తుంది. ఒత్తిడిని ఎదుర్కోవడంలో మగవాళ్లకు మహిళలకు మధ్య తేడా ఉంటుంది. మానసికమైన ఒత్తిడి, భావోద్వేగాలు వారి సమర్థమైన ప్రదర్శన మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ పరిస్థితిని అధిగమించడానికి మెడిటేషన్, బ్రీత్ ఎక్సర్‌సైజ్, కృతజ్ఞత, క్షమ, పరిస్థితిని యథాతథంగా స్వీకరించడం వంటివి సాధన చేయాలి.

ఎప్పుడు తినాలి? ఎలా తినాలి?

ఆహారంతోపాటు హైడ్రేషన్, మీల్ టైమింగ్, వర్కవుట్‌కు రెండు - మూడు గంటల ముందు తీసుకోవాల్సిన ఆహారం, వర్కవుట్ సమయం గంటకు మించినప్పుడు మధ్యలో తీసుకోవాల్సిన తక్షణ శక్తినిచ్చే ఆహారం, వర్కవుట్ తర్వాత కండరాల పునర్నిర్మాణం కోసం తీసుకోవాల్సిన ఆహారం మోతాదులు స్పష్టంగా నిర్దేశితమై ఉంటాయి. అయితే బాడీ కంపోజిషన్, మెటబాలిక్ రెస్పాన్స్, ఫుడ్ ఇన్‌టాలరెన్స్ వ్యక్తికీ వ్యక్తికీ మారుతుంటాయి. కాబట్టి సాధారణ నియమావళిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క స్పోర్ట్స్‌పర్సన్‌కి వ్యక్తిగత డైట్ ప్లాన్ సిద్ధం చేయాలి. అలాగే వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్, వీగన్ వంటి వారి వ్యక్తిగత ఆహార విశ్వాసాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఐరన్: రెడ్ మీట్, ఆకు కూరలు, ధాన్యాల ద్వారా శక్తితోపాటు దేహభాగాలకు ఆక్సిజన్ సమర్థంగా అందుతుంది.
క్యాల్షియమ్: వెన్న తీయని పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు ఎముకల పటుత్వానికి దోహదం చేస్తాయి.
విటమిన్-డీ: కొవ్వుతో కూడిన చేపలు, తృణధాన్యాలు, సూర్యరశ్మి ద్వారా ఎముకల పటుత్వంతోపాటు వ్యాధినిరోధకత మెరుగవుతుంది.
మెగ్నీషియం: నట్స్, సీడ్స్, పొట్టుతీయని ధాన్యాలు, ఆకుకూరలు శక్తిని పెంచడంతోపాటు కండరాల సంకోచవ్యాకోచాలను సులువు చేస్తాయి.
ఎలక్ట్రోలైట్స్: పండ్లు, కూరగాయలు, పాలు, పాల ఉత్పత్తులు, స్పోర్ట్స్ డ్రింక్‌లు దేహంలో ద్రవాల స్థాయులను క్రమబద్ధీకరించడంతోపాటు కండరాల పనితీరును మెరుగుపరుస్తాయి.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మోటారు పాఠం.. జపాన్ చేర్చుతోంది!

• సకుర సైన్స్ ఫెస్టివల్‌లో కరీంనగర్ బాలికకు చోటు

బోటనీ పాఠమంటే.. బోరు..బోరు.. హిస్టరీ రొస్టు కంటే రెస్ట్ మేలు.. అని పాడుకుంటే పొరపాటే.. పాఠం సరిగా వింటే విదేశీయానం, విమానమెక్కే యోగం దక్కుతుందని నిరూపించింది కరీంనగర్ జిల్లా శంకరపట్నంకు చెందిన నబా మొహమ్మదీ. ఇటీవల హైదరాబాద్‌లో ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏకంగా ఈ ఏడాది నవంబరులో జపాన్‌లో జరిగే సకుర సైన్స్ ఫెస్టివల్ లో పాల్గొనబోతోంది. ఇదంతా ఎలా సాధ్యమైంది? కేవలం సైన్స్ మీద ఉన్న ఆసక్తి.. మోటారు పాఠం వినడం వల్లే అంటుంది. నబా..! తనకు సైన్స్‌పై ఉన్న ఆసక్తి తనను జపాన్ గడ్డపై కాలు మోపేలా చేస్తుందని 'సాక్షి'కి చెప్పింది.



ఏంటా మోటారు కథ...!

నబా ప్రస్తుతం శంకరపట్నంలోనే ఇంటర్ సెకండియర్ చదువుతోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం తాను 9వ తరగతిలో ఉండగా.. విన్న ఫిజిక్స్ పాఠం తన ఆలోచన తీరును మార్చివేసింది. 8 వ తరగతి వరకు బేసిక్ సైన్స్ విన్న తాను.. తొలిసారిగా మోటారు ఎలా పనిచేస్తుందో తన గురువులు చెప్పిన పాఠానికి ముగ్ధురాలైంది. విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తిని కలిపి మోటారు నడిపే విధానం తెలుసుకోవడం తనకు సైన్స్ ఉన్న ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిన్న సూత్రం ఆధారంగా ప్రపంచంలోని ఎన్నో మోటార్లు ఎలా నడుస్తున్నాయన్న విషయంపై తనకు పూర్తి అవగాహన వచ్చింది. అది మొదలు సైన్స్‌పాఠాలను మరింత శ్రద్ధగా చదువుతూ విశ్లేషణ చేసుకునేది. ప్రతీది తనకు అర్థమయ్యేందుకు అదనపు పుస్తకాలు, యూట్యూబ్ చూసేది. ఇటీవల జిల్లా స్థాయిలో ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కరీంనగర్ నుంచి మొదటి స్థానంలో నిలిచింది. అదే ఊపులో రాష్ట్రస్థాయికి ఎంపికై టాప్-5లో టాప్-2 స్థానం దక్కించుకుంది. ఫలితంగా నవంబరులో జపాన్‌లో జరిగే సుకుర సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనే అరుదైన అవకాశం చేజిక్కించుకుంది.

తాను కూడా ఏదైనా సాధించాలంటే..!

అదే ఉత్సాహంతో తాను కూడా ఏదైనా సాధించాలని తలచింది. అంధులకు దారి చూపేందుకు ప్రత్యేక డివైజ్ రూపొందించింది. ఇది ప్రస్తుతం ప్రోటోటైప్ దశలోనే ఉంది. దీన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనికి త్వరలోనే పేటెంట్ కూడా దరఖాస్తు చేసుకుంటానని నబా 'సాక్షి'కి వివరించింది. జపాన్ పర్యటనలో అక్కడ శాస్త్ర సాంకేతిక రంగాలను గమనించి, వాటిని ఇక్కడఅమలు చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపింది. తాను ఈ ప్రగతి సాధించడం వెనక తన తండ్రి షాబీర్, ఫిర్దోస్ సుల్తానాలు ఎంతో ప్రోత్సహించారని, సంప్రదాయ కుటుంబమైనా, బాలికనైన తనను అన్ని కాంపిటీషన్లకు పంపించారని తెలిపింది. అదే సమయంలో తనకు పాఠాలు చెప్పిన గురువులకు తానెప్పుడూ రుణపడి ఉంటానని, పెద్దయ్యాక శాస్త్రవేత్తనవుతాననీ, అంధులకు చూపునవుతాననీ వారికి దారి చూపేందుకు రూపొందించిన ఉపకరణాన్ని మరింత అభివృద్ధి చేస్తాననీ చెప్పింది. భవిష్యత్తులో శాస్త్రవేత్తగా ఎదగడమే తన కల అని వివరించింది నబా.

- బి. అనిల్‌కుమార్,
సాక్షి ప్రతినిధి, కరీంనగర్